




అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

మిడ్‌డేమీల్స్‌పై.. 'అధికార' బెదిరింపు..!





ప్రతిపక్షంలో ఉండగా సామాన్యులకు అండగా ఉంటామని హామీలు గుప్పించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే వాటికి తిలోదకాలిచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఏకపక్షంగా రద్దు చేసి తమ వారికిస్తున్నారన్న ఆరోపణలు నెలకొన్నాయి. అధికారంలోకి వచ్చిన 40 రోజుల వ్యవధిలోనే పావు వంతు మధ్యాహ్న భోజన ఏజెన్సీలను రద్దు చేసింది. ఇందులో నిబంధనలు కూడా పాటించకుండానే తొలగించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ◆ ఏకపక్షంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలు రద్దు
- ◆ ఇప్పటికే పావు వంతు తొలగింపు
- ◆ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా ఉపాధి లభించే వాటిపై టిడిపి శ్రేణులు దృష్టి సారించాయి. ఇందులో భాగంగా రేషన్ షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్, యానిమేటర్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ తదితర వాటిని దక్కించుకునే ప్రయత్నాలు ఆరంభించారు. ఇందులో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహులు పాత వారిని మార్చేసి టిడిపి మద్దతుదారులకు అప్పగించే ప్రయత్నం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నడుస్తోంది. ఇప్పటికే చాలా పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీలను లాగేసుకున్నారు. అనంతపురం జిల్లాలో మొత్తం 1640 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు నడుస్తున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండిపెట్టే పనిని వీరు చేస్తారు. 2003 నుంచి వీరు పనిచేస్తూ వస్తున్నారు. అటువంటి వారిని కూడా ఇప్పుడు తొలగించేశారు. టిడిపి అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇక తమవారికివ్వాలి కాబట్టి తప్పుకోవాలని స్థానిక నాయకులు ఏజెన్సీ నిర్వాహకులపై ఒత్తిళ్లు పెంచుతున్నారు. దీంతో అధికారులు ఉన్న వారిని కాదని కొత్తవారికి ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు చెప్పడంతో నిర్వాహకులకు దిక్కుతోచడం లేదు. ఉన్నఫలంగా ఉపాధి కోల్పోతుండటంతో తమ బాధ ఎవరితో చెప్పుకోవవాలో పాలుపోని పరిస్థితుల్లో వారు ఉన్నారు. ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలోని 32 మండలాల్లో కలిపి సుమారు 400 మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చేశారు.

నిబంధనలకు తిలోదకాలు

మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలంటే కొన్ని నిబంధనలున్నాయి. వాటిని ఏ మాత్రం పాటించడం లేదు. సరిగా భోజనం లేకపోతే ముందుగా నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. మూడు నోటీసుల తరువాత కూడా తప్పులు జరిగితే అప్పుడు పాఠశాల యాజమాన్య కమిటీలో నిర్ణయం చేసి ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాతవారిని తొలగించి కొత్త వారికివ్వాల్సి ఉంటుంది. ఇవేవీ పాటించకుండానే ఏకపక్షంగా ఏజెన్సీలను రద్దు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులేమి పట్టనట్టు ఉన్నారు. అధికారపార్టీ నేతలు ఆదేశాలకు అనుగుణంగా పై మార్గదర్శకాలేవి పాటించకుండానే నేరుగా పాతవారిని తప్పించి కొత్తవారికి బాధ్యతలు ఇస్తుండటం గమనార్హం.

తొలగింపు సరికాదు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఇష్టారీతిన మార్చడం సరైంది కాదు. లోపాలుంటే ముందుగా వారి దృష్టికి తీసుకెళ్లాలి. సరిచేసే ప్రయత్నం చేయాలి. అలాకాకుండా రాజకీయ ఒత్తిళ్ల మేరకు మార్పులు చేయడం సరైంది కాదు. నిబంధనలు పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ రకంగా తొలగించడం మంచిది కాదు. ఈ విషయాన్ని తాము అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. వారైనా దీనిపై స్పందించాలి.

నాగమణి , సిఐటియు జిల్లా అధ్యక్షురాలు.

సమస్యలు పరిష్కరిస్తే ప్రగతి సాధ్యం

- ◆ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ◆ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమిస్తే ఆయా విభాగాల్లో ప్రగతిని సాధించగలం అని కలెక్టర్ టిఎస్.చేతన్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్య రేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 265 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పనిచేద్దాం - లక్ష్యాలు సాధిద్దాం అన్న నినాదంతో ముందుకెళ్లాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒకరోజు శుక్రవారం నాడు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులను తనిఖీలు చేయాలన్నారు. అక్కడ సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి10-30 గంటల మధ్య నెవల చివరి శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. వారివారి శాఖల్లో సమస్యలు, వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో 24 గంటల కాల్ సెంటర్ ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వెంకటరమణ అధికారులు పాల్గొన్నారు.

వందశాతం పన్నుల వసూళ్లు చేయాలి

వంద శాం ఇంటి పన్నుల వసూళ్లకు ఈనెల 30వ తేదీ చివరి తేదీ అని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి, నీటి సరఫరాకు సంబంధించి చేపట్టే పలు పనులపై ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సోమవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ధర్మవరం డీఎల్‌పిఒ శివకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిపన్ను శుద్ధీకరణలు, పన్నుల వసూళ్లలో జిల్లా ప్రగతి 64 శాతం ఉందన్నారు. ఇది వంద శాతం చేరుకోవాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు ఇంటి పన్ను శుద్ధీకరణ, వసూలు ప్రక్రియను బాధ్యతగా తీసుకోవాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి నివారణలో శానిటేషన్, డ్రెయిన్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంలు రామమోహన్, రామిరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-అమరాపురం

సొంత వ్యవసాయ భూమి లేకుండా మరొకరి భూమిని కౌలుకు చేస్తున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రానికి వెళ్లి కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ సూచించారు. కౌలు రైతులకు ప్రభుత్వం 'పంట సాగు హక్కు పత్రం'(సిసిఆర్‌సి కార్డ్) ఇస్తుందని, దీని ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కౌలు రైతుకు కూడా అందుతాయన్నారు. కావున కౌలు రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రానికి వెళ్లి భూయజమాని ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పాసుపుస్తకం జిరాక్స్, ఒక పాస్ ఫొటో, అలాగే కౌలు రైతు ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, ఒక పాస్ ఫొటో తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని ఏవో సూచించారు.

ప్రజల సమస్యలపై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-అమరాపురం


మండలంలో ప్రజల సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మండలంలోని వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రధానంగా సీజనల్ వ్యాధుల నిర్మూలన, పారిశుధ్యం, మురికి కాలువల శుభ్రత, ఇంటి పన్ను వసూలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కూలీల సంఖ్య పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన సమస్యల పరిష్కారంపై చర్చించారు. సమావేశంలో ఈఓఆర్‌డి నాగముని, ఎపిఒ జగదీష్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆల యంలో ఈ నెల 21వ తేదీ గురు పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలి పారు. అదే రోజు ఆలయంలో శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు తిమ్మారెడ్డికి ఘన నివాళి

మడకశిర : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్సీ తిమ్మారెడ్డి జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు న్యాయవాది గోవర్ధన్‌రెడ్డి, సంభాగ అధ్యక్షులు ఎఎస్.గోపాలకృష్ణ, సమితి అధ్యక్షులు సిఎ.బద్రి నారాయణ, పాఠశాల కార్యదర్శి జి.హనుమంత రెడ్డి, పాఠశాల అధ్యక్షులు ఎస్‌వి. సత్యనారా యణ, ప్రధానాచార్యులు రాఘవచారి పాల్గొన్నారు.



తిమ్మారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : సబ్ కలెక్టర్

మడకశిరలో డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సొంత ఖర్చులతో పట్టణంలోని ఎస్‌వైటిఆర్ డిగ్రీ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులను సోమవా రం ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, డిప్యూటీ డిఇఒ రంగస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తహశీల్దార్ వెంకటేష్ హాజరయ్యారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత డీఎస్సీ అభ్యర్థుల కోసం మడకశిరలో ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అర్హులైన అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన తనకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల ఇబ్బందులు తెలుసని, అందుకే నియోజక వర్గంలో డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడినా, అందుకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇలాంటి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం చాలా అరుదన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌ను ఎమ్మెల్యే రాజు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి, టిడిపి మండల కన్వీనర్లు గణేష్, మద్దన కుంటప్ప, లక్ష్మీనారాయణ, మనోహర్, దాసిరెడ్డి, బిఎస్.గురుమూర్తి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జోగప్ప, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, బేగార్లపల్లి రవికుమార్, కాంతరాజు, డీఎస్సీ అభ్యర్థులు హాజరయ్యారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు : ఎమ్మెల్యే రాజు

అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా, వారి సమస్యలను వెంటనే పరిష్క రించాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆదేశించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన అర్జీలను అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా వన్ బి, అడంగల్, బర్త్, క్యాస్ట్ సర్టిఫికెట్‌లు, దీర్ఘకాలంగా ఉండే భూముల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీవో, ఎంఈఓ శ్రీనివాసభాస్కర్, అధికారులు పాల్గొన్నారు.



జిపిఎస్ గెజిట్ ప్రతులతో నిరసన తెలుపుతున్న సిపిఎస్ ఉద్యోగులు

జిపిఎస్ గెజిట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి-సోమందేపల్లి

సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్ గెజిట్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎపిసిపిఎస్‌ఈఎ పెనుకొండ జోన్ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద జిపిఎస్ గెజిట్ కాపీలను దహనం చేశారు. ఎపి సిపిఎస్‌ఈఏ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వా నికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం జిపిఎస్ గెజిట్‌ను విడుదల చేయడం సిపిఎస్ ఉద్యోగులను మోసం చేయడమే అన్నారు. ఏడాదిలో సమస్యకు పరిష్కారం చూపిస్తామని సిఎం, డిప్యూటీ సిఎం, విద్యాశాఖ మంత్రి చెప్పి ఇలా జిపిఎస్ గెజిట్ విడుదల చేయడం ఏంటని ప్రశ్నించారు. సిపిఎస్ ఉద్యోగులకు ఓపిఎస్ తప్ప మరేది వద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లికార్జున, రంగేష్‌కుమార్, ఆంజనేయులు, వెంకటరమణ నాయక్, చంద్ర మౌళి, సజ్జరాయప్ప, చంద్ర, వెంకటేష్, మల్లికార్జున, శ్రీనివాసులు, సోమశేఖర్, రఘునాథ్, సంజీవ్, సురేంద్ర, ఓబులేసు, సురేంద్రరెడ్డి, జహీర్, సురేందర్‌రెడ్డి, ట్రెజరీ డిపార్ట్మెంట్ నుంచి జగన్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, బ్యూటీపార్లర్, టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-లేపాక్షి

మహిళల కోసం సోమవారం స్థానిక ఆశ్రయ సేవా ట్రస్ట్‌లో కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ కేంద్రా న్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరన ఐటిఐ ప్రిన్సిపల్ రాయపురెడ్డి మాట్లాడుతూ లేపాక్షి ఐటిఐ కాలేజీ జిల్లాలోనే ఏకైక ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ అని, ఇందులో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపాధి వృత్తి పనులకు సంబంధించి జెఎస్ఎస్ నుంచి కూడా అనేక కోర్సులు ఉన్నా యని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వెలుగు ఎపిఎం జయచంద్ర మాట్లాడుతూ ఉపాధి శిక్షణ పొందిన మహిళలకు వెలుగు ద్వారా ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ సదుపాయాలన్నీ మహిళలకు అందజేయడానికి ప్రయత్నిస్తున్న ఆశ్రయ సేవా ట్రస్ట్ సభ్యు లను అభినందించారు. అనంతరం కంప్యూటర్ శిక్షకులను ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగభూషణ, యోగా ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ నాగరాజు, ఆశ్రయ సేవా ఫౌండర్స్ నళినాక్షిశివకుమార్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : రొళ్ల, అగళి మండలాల్లోని రామనహళ్లి, కురుసంగన హళ్లి, రత్నగిరి, గొల్లహట్టి గ్రామాలకు చెందిన 50 వైసిపి కుటుంబాలు సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అగళి జడ్పిటిసి ఉమేష్, రొళ్ల మండల కన్వీనర్ దాసిరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణప్ప, అగళి మండల కన్వీనర్ కుమారస్వామి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. అదే నిర్లక్ష్యం

రొద్దం : ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను, అధిక లోడును తరలించవద్దని నిత్తం పోలీసులు, ట్రాఫిక్ అధికారులు హెచ్చరిస్తూనే ఉంటారు. అయినా కొందరు ఆటో డ్రైవర్లు అవేమీ పట్టించుకోకుండా ప్రమాదకర రీతిలో రవాణా చేస్తూనే ఉన్నారు. ఈ కోవలోనే సోమవారం రొద్దం సమీపంలో అధిక లోడుతో చెక్కలు(ఇంటి సామగ్రి) వేసుకొని పావగడ వైపు నుంచి వచ్చిన ఆటో డీజిల్ కోసం బంకులోకి వెళ్తుండగా ఆటో ఉన్నఫళంగా పైకి లేచింది. దీంతో అందులోని చెక్కలు రోడ్డుపై పడిపోయాయి. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటన చూసిన పలువురు అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను పోలీసులు కట్టడి చేయాలని కోరుతున్నారు. ఇదే తరహాలో విద్యా ర్థులు, కూలీలను తరలిస్తుంటారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.







జెసిబిలతో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కదిరిలో ఆక్రమణల తొలగింపు

- ◆ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించం
- ◆ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అధికారుల్లో కదలిక వచ్చింది. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఆక్రమ కట్టడాల తొలగింపునకు సోమవారం ఉపక్రమించారు. కదిరి పట్టణం గట్లు సమీపాన ముత్యాల చెరువు గ్రామ పొలం సర్వే నెంబర్ 87-2లో కోట్లు విలువచేసే 30 సెంట్లు ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ప్రజాశక్తిలో ఆదివారం నాడు 'ఆక్రమించి.. దర్జాగా నిర్మించు'..! అన్న శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. కదిరి పట్టణంలో జరుగుతున్న ఆక్రమణలపై ఇతర పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే కందికుంట స్పందించారు. ముత్యాల చెరువు గ్రామ పొలం సర్వే నెంబర్ 87-2లో ప్రభుత్వ స్థలంను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను తొలగించాలని తహశీల్దార్ పుల్లారెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం ఉదయం అక్కడికి చేరుకుని జెసిబితో అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఆక్రమణకు గురైనా వెంటనే మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమలన్నింటినీ స్వాధీనం చేసుకునేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై స్పందించి చర్యలకు ఉపక్రమించడంతో ప్రజాసంఘాల నాయకులు జిఎల్.నరసింహులుతో పాటు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దళిత మహిళ హత్య కేసులో నిందితులను శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-సోమందేపల్లి

దళిత మహిళ గుండమ్మ హత్యకు కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌కి వినతిపత్రం సమర్పించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆదోని మండలంలో దళిత మహిళ గుండమ్మను అదే గ్రామానికి చెందిన పెత్తందారులు శ్రీధర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, సోమప్ప, నాగరాజు, లక్ష్మణ్ ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేశారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గుండమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షలు ఇవ్వాలని కోరారు. దళిత చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే ఇలాంటి హత్యలు, అత్యారాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని దళితులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాముడు, ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, మండల నాయకులు తిప్పన్న, సరస్వతమ్మ, శశికళమ్మ, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌కి వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

తాగునీటి కోసం బూచర్ల గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని బూచర్ల గ్రామంలో తాగునీటి సమస్యపై సోమవారం ఆర్.మరవపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కేశవరెడ్డికి గ్రామస్తులు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నీటి ట్యాంకులోకి నీరు వదలకుండా నిర్వాహకుడు ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ వదులుతున్నారని, దీంతో ఆ సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లిన ప్రజలు తాగునీరు పట్టుకోలేకపోతున్నారన్నారు. కావున గ్రామంలో ఉన్న నీటి ట్యాంకులోకి నీరు వదిలితే ఎప్పుడపడితే అప్పుడు తెచ్చుకోవచ్చని వారు ఎంపీడీవోకు తెలిపారు. స్పందించిన ఎంపిడిఒ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి వెంటనే ఆ గ్రామానికి తాగునీటి ట్యాంకర్ పంపాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తు లతో మాట్లాడుతూ ఇకనై రోజు వదిలి రోజు ట్యాంకర్‌ను గ్రామంలోకి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, కదిరన్న, మల్లేష్పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : సిఐటియు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు.కొత్తచెరువులోని టీటీడీ కళ్యాణ మండపం ఆవరణంలో సిఐటియు మండల అధ్యక్షులు ముత్యాలు, ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి అంగన్వాడీ. ఆశా కార్యకర్తలు, హమాలీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటం వల్లనే ప్రజలు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్మికులు ఉద్యోగులు సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం వివిధ ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ పనిచేస్తున్న కార్మికులను తొలగించడానికి సిద్ధమవుతోందని అలాంటి వాటికి స్వస్తి పలకాలని అన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలన్నారు. అనంతరం సిఐటియు నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్ గా ముత్యాలు, కో కన్వీనర్లుగా శంకర్ రెడ్డి, షర్మిలతో పాటు 17 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బేళ్ల అంజి, పెద్దన్న, చెన్నకేశవులు, భగవంతు, ఓబులేసు, అంగన్వాడీలు రాధా, నాగమణి, ఆశా కార్యకర్తలు, హమాలీలు, పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులను అరికట్టాలి : కొత్తచెరువు మండలంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, అతిసార, టైఫాయిడ్, మలేరియా, వ్యాపిస్తున్నాయని వాటిని తక్షణమే అరికట్టాలని సిఐటియు నాయకులు కోరారు. ఈమేరకు ఆసంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కళావతికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, మురుగు పేరుకుపోవటంతో దోమలు అధికమై జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. పలువురు అనారోగ్యానికి గురై ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు.

జడ్చర్ల వద్ద ధర్మవరం ఆర్టీసీ బస్సుకు ప్రమాదం

15 మంది ప్రయాణికులకు గాయాలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బురెడ్డిపల్లి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ధర్మవరం ఆర్టీసీ బస్సు మరో వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 15 మంది దాకా ప్రయాణీకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ నుండి మెరుగైన వైద్య చికిత్సల కోసం కొందరిని హైదరాబాద్ లోని గాంధీఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రమాదం గురించి ఆరాతీశారు. ప్రమాదం ఘటన గురించి అధికారారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి అనే మహిళ ఆరోగ్యపరిస్థితిపై డాకర్లతో ఫోన్లో మాట్లాడారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కోరారు. బాదితులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల పరిధిలోని సూర్యచంద్రాపురం వద్ద అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీ కొన్న ఈ ప్రమాదంలో టొలెరో వాహనం డ్రైవర్ గంగాధర్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు ఆయనను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని శ్రీ సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ ఎన్. విష్ణు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి జిల్లా అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ హర్ష, సిబ్బంది, ఫిర్యాదుదారులు పాలొన్నారు.

22నుంచి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని తారక రామాపురం ఆర్డీటీ క్రీడామైదానంలో ఆర్డీటీ ధ్వర్యంలో ఈనెల 22న క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 20వతేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985929285, 9966492540 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్యసాయి భక్తుల పాదయాత్ర

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఆషాడ ఏకాదశి సందర్భంగా మహారాష్ట్రకు చెందిన సత్యసాయి భక్తులు ధర్మవరం నుండి పాదయాత్రగా సోమవారం సాయం కాలానికి కొత్తచెరువుకు చేరుకున్నారు. వీరికి సత్యసాయి బాబా సేవ సమితి వారు స్వాగతం పలికారు. భక్తులు సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి భజనలు చేసుకుంటూ పాదయాత్ర నిర్వహించారు. వీరు ప్రతి ఏడాది ఆనవాయితీగా ఆషాడ ఏకాదశి రోజు సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్నారు.

ప్రభాస్ అభిమానుల సంబరాలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభాస్ నటించిన కల్కి చిత్రం రూ. వేయికోట్ల కలెక్షన్ల రికార్డును బ్రేక్ చేయడంతో ప్రభాస్ అభిమానులు సోమవారం పట్టణంలోని కల్కీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న టాకీస్ ఎదురుగా సంబరాలు జరుపుకున్నారు. ప్రభాస్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సడ్లపల్లి వెంకటేష్ రెడ్డి, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభానికి సన్నాహాలు



అన్నాక్యాంటిన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

రూ.7.50లక్షలతో పాత భవనాలకు మరమ్మతులు

ప్రజాశక్తి-హిందూపురం

నిరుపేదలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించే లక్ష్యంతో గతంలో టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. గత వైసిపి ప్రభుత్వం ఈ క్యాంటిన్లు రద్దు చేయడంతో పాటు ఆ భవనాలను సచివాయాలుగా ఉపయోగించుకుంది. నెలరోజుల క్రితం రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. దీంతో అన్న క్యాంటీన్లను తిరిగి తెరపిస్తామని ప్రకటించింది. పట్టణంలో ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో ఒకటి, బెంగళూరురోడ్డులో ఒకటి రెండు క్యాంటీన్లను గతంలో నిర్వహించే వారు. తిరిగి అదే ప్రదేశాల్లో కాంటీన్లను నెలకొల్పడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గతంలో నిర్వహించిన భవనాల్లో తిరిగి వీటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అసుపత్రి వద్ద ఉన్న క్యాంటీన్ భవనం మరమ్మతుకు రూ.4లక్షలు, బెంగళూరు రోడ్డులో ఉన్న భవనం మరమ్మతుకు రూ. 3.50లక్షలు మున్సిపల్ శాఖ తరపున నిధులు కేటాయించారు. ఆగస్టు 15 నుంచి వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు నాటికి పూర్తి స్థాయిలో రంగులు వేసి, బోర్డులు ఏర్పాటు చేసి సిద్ధం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఆదేశాలు అందాయి. మూడు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ చేతన్ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసే భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరతగితిన పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి ఆదేశించారు.



తమ సమస్యను చెబుతున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

బకాయిలు ఇవ్వండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికలలో తమ సేవలు వినియోగించుకున్న అధికారులు బకాయిలు చెల్లించలేదని తమకు న్యాయం చేయాలని జిల్లా ఫోటోగ్రఫీ, వీడియో గ్రాఫర్లు కలెక్టర్ టిఎస్ చేతన్‌కు విన్నవించుకున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టరేట్‌లో సిల్క్ సిటీ ఫోటోగ్రఫీ, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎస్. రామ్మోహన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఎన్నికలలో 21 మంది వీడియో గ్రాఫర్లు 57 రోజులు పాటు ఆయా మండల అధికారులు విధులు నిర్వర్తించారన్నారు. వారి సేవలకు ప్రతిఫలంగా రావాల్సిన బకాయిలు ఇప్పటివరకు అధికారులు చెల్లించ లేదన్నారు. ఎన్నికల విధులలో తమ స్వంత వాహనాలలో టిఎ, డిఎ లేకుండా పనిచేశామన్నారు. తమ సేవలను వినియోగించుకున్న తహశీల్దార్లను అడిగితే బడ్జెట్ రాలేదని చెబుతున్నారని అన్నారు. ప్రస్తుతం సీజన్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా కలెక్టర్ చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

దాతలు ఇచ్చిన సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక చిన్న మార్కెట్ సర్కిల్ లో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితర విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పేదరికంలో ఉన్న విద్యార్థులను ఆదుకోవడానికి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహకారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం చేయూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా తరహాలోనే ఈ ఏడాది కూడా తమ వంతు సహకారంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత అందించడం అభినందనీయం అన్నారు. మదర్స్ ఆసుపత్రి డాక్టర్ నిఖిల మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ నిర్వాహకులు గూడూరు రమేష్, గూడూరు అరుణ, డాక్టర్ గూడూరు భాను తేజ, కళాశాల అధ్యాపకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్టు నిర్వాహకులు

మహిళలు నైపుణ్యాభివృద్ధి సాధించాలి



జ్ఞాపికను అందజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మహిళలు నైపుణ్యాభివృద్ధి సాధించి అభివృద్ధి చెందాలని నాబార్డు డిడిఎం అనురాధా, ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం అన్నారు.కదిరి మునిసిపల్ పరిధిలో శుభయశ్రీ సారీస్ ప్రింటింగ్ యూనిట్‌లో వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో శారీస్ హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథుగా ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటచలం, నాబార్డు డిడిఎం అనురాధ, వరల్డ్ సంస్థ ప్రసిడెంట్ యశోద , ఫైనాన్స్ లిట్రసి మారుతి హాజరుకాగా ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్‌లో రెండు బ్యాచుల శిక్షణ ముగిసిన శిక్షణ పొందిన మహిళలు వారి నైపుణ్యాన్ని పెంచుకుని ఉపాధి పొందాలన్నారు.

అభివృద్ధికి సహకరించండి

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని ధర్మవరం-గోరంట్ల ప్రధాన రహదారిలో జగరాజు పల్లి వద్ద కొండపై ఉన్న ఓబులేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఈనెల 17 ,18 వ తేదీల్లో ఏకాదశి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి పుట్టపర్తి, గోరంట్ల ,కొత్తచెరువు ,బుక్కపట్నం, మండలాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రానికి చెందిన మేకల సూరి, దొరికిల్లు క్వార్టర్స్ గ్రామానికి చెందిన రమేష్ నాయక్ అనే టిడిపి కార్యకర్తలు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మృతుల కుటుంబాలను సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు.

నిందితులను శిక్షించాలి : బిఎస్పీ


ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి చంపేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని బహుజన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ధర్మవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకర్‌రావు 68వ జన్మదిన వేడుకలు సందర్భంగా రోగులకు బ్రెడ్లను పంపిణీ చేశారు. తొలుత కాలేజీ సర్కిల్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద విగ్రహానికి పూలమాలవేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షులు నామాల శంకర్, గిర్రాజు రవి, బోయ రవిచంద్ర, బీసీ నాయకులు పాల్గొన్నారు.



బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి- చిలమత్తూరు

మండల పరిధిలోని లాలేపల్లి, సంజీవరాయినిపల్లి, పాతచామలపల్లి గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను సీడీపీవో రెడ్డి రమణమ్మ సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రెడ్డి రమణమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారాన్ని పోషక పదార్థాలను అందించాలని సిబ్బందికి సూచించారు. సమయానికి అంగన్వాడీలకు చేరుకోవాలని పిల్లలని కేంద్రాలకి తీసుకొచ్చే బాధ్యత ఆయాలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలను చేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.



చిన్నారితో మాట్లాడుతున్న సిడిపిఒ

న్యాయం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపైనా, అతని కుటుంబసభ్యులపైనా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ధర్మవరం పట్టణానికి చెందిన గిరిజన యువతి పోలీసులను ఆశ్రయించారు. ధర్మవరం పట్టణానికి చెందిన శ్రావణి సోమవారం జిల్లాపోలీసుకార్యాలయానికి వచ్చి తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు వివరించింది. భర్త చనిపోయిన తనను ఆదుకుంటామని తన భర్త స్నేహితుడు విష్ణుగణేష్ నమ్మబలికి తనతో సంబంధం పెట్టుకుని ఇప్పుడు మోసం చేశాడని బాధితురాలు వాపోయింది. ఇదేమని ప్రశ్నిస్తే తనను, తన కుటుంబసభ్యులపై విష్ణుగణేష్ కుటుంబసభ్యులు దాడికి పాల్పడ్డారని ఆరోపించింది. ఈ విషయంపై జిల్లా స్థాయి పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది.

అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్ మండల అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలను పరిష్కారం కోరుతూ అర్జీలు తీసుకువస్తే వాటికి వెంటనే పరిష్కారం చూపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, ఎపిఎం సుదర్శన్‌రాజు, మండల ఇంజనీర్ రమణయ్యతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు చేస్తాం


ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం పారిశ్రామికవాడలో పరిశ్రమల నిర్వాహకులను కొంతమంది విరాళాల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారని ఇలా జరిగితే ఫిర్యాదు చేయాల్సి వస్తుందని పలువురు పారిశ్రామికవేత్తలు తెలిపారు. పారిశ్రామిక వాడలోని ఏపీఐఐసీ కార్యాలయ ఆవరణంలో తూముకుంట పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిశ్రమల నిర్వాహకులు సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాగే బెదిరింపులకు పాల్పడితే తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు పరిశ్రమలను మూసి వేయడానికి సిద్ధమవుతామని ప్రకటించారు. నిజమైన కార్మిక సంఘాలు, స్థానిక ప్రజా సంఘాలు కార్యక్రమాల కోసం విరాళాలు అడిగితే తాము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఇప్పటివరకు ఎప్పుడు చూడని గుర్తు తెలియని వ్యక్తులు వివిధ రాజకీయ పార్టీల పేరుతో, కార్మిక సంఘాల పేరుతో విరాళాల కోసం పదేపదే వేధిస్తున్నారన్నారు. ఇవ్వకపోవడంతో వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై త్వరలో అన్ని ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అసోసియేషన్ నాయకులు వెల్లడించారు.

పిసిసి అధ్యక్షురాలిని కలిసిన 'రంగన'

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పిసిసి అధ్యక్షురాలు షర్మిలను ధర్మవరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రంగన అశ్వర్థ నారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో షర్మిలను కలిసిన రంగన అశ్వర్థనారాయణ జిల్లా సమస్యలను ఆమెకు వివరించారు. ఈసందర్భంగా రంగన అశ్వర్థ నారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని చేనేతల, రైతు, భవన నిర్మాణ కార్మిక, నిరుద్యోగ సమస్యలు గురించి షర్మిలకు వివరించినట్లు చెప్పారు.



షర్మిలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'రంగన'

పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ రెడ్డి డిమాండ్ చేశారు. పుట్టపర్తి లోని సీపీఐ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అరుణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సరిపడ పాఠ్య పుస్తకాలు అందించడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వెంటనే చొరవ చూపి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి గౌతం, మదన్, చరణ్ కుమార్, మహ్మద్ రఫీ, రమేష్, సురేష్, విజయ్, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

19న కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

గురు పౌర్ణమి సందర్భంగా వికలాంగులకు ఈనెల 19న కృత్రిమ కాళ్లు, చేతుల పరికరాలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని ఏపీ సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికలాంగులు తమ పనులు చేసుకోవడానికి అనువైన కృత్రిమ కాళ్లు చేతుల పరికరాలు వారి కొలతలకు సరిపడే విధంగా నిపుణులైన వారిచే తయారు చేయించి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కాళ్లు చేతులు పాక్షికంగా లేదా పూర్తిగా లేనివారికి సరిపడే పరికరాలు పుట్టపర్తిలో అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9440090556 లేదా 9396666697 గల ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చు అని అన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

బత్తలపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వంశీకృష్ణారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుధాకర్‌నాయక్, సిఎస్‌టి శారద, హెచ్‌ఎం జయంతి, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్ ముఖ్‌కు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ పరిధిలోని దుర్గాబాయి దేశ్ ముఖ్ పురపాలక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప దుర్గాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవమ్మ, ఉపాధ్యాయులు శంకర్, విజయలక్ష్మి, లలిత, సుమతి, లక్ష్మీ ప్రసన్న, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు